# నవభూమి హైదరాబాద్

07 మే,2025 బుధవారం|పేజీలు:7

www.epaper.navabhoomi.in






## జాతీయ రహదారుల అభివృద్ధికి
# సహకరించండి

- ❑ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి మంత్రి తుమ్మల వినతి
- ❑ సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరి
- ❑ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**తుమ్మలపల్లి ప్రసాద్ / హైదరాబాద్ మే 6 నవభూమి స్టేట్ బ్యూరో చీఫ్:** తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో మంత్రి తుమ్మల కేంద్రమంత్రి గడ్కరి తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జాతీయ రహదారుల అభివృద్ధి, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ రహదారుల అభివృద్ధితో ప్రగతికి బాటలు పడుతాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు జాతీయ రహదారులను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని తెలంగాణ ప్రభుత్వ పక్షాన మంత్రి తుమ్మల కోరారు. జాతీయ రహదారుల అభివృద్ధితో రాష్ట్రాల మధ్య సంబంధాలు పెరగడంతో పాటు ప్రధానంగా వాణిజ్య, పర్యాటక రంగాలు విశేషంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ జాతీయ రహదారుల నిర్మాణంతో రాష్ట్రాల మధ్య దూరా భారం తగ్గుతుందని, అలాగే రెండు తెలుగు రాష్ట్రాలు శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్రమంత్రి కి వివరించారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే కి రెండు వైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల పరిసర నియోజకవర్గ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని కేంద్రమంత్రికి వివరించారు. ప్రజల సౌకర్యార్థం సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయించాలని కోరారు.

జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వయా వైరా మీదుగా 100 కిలోమీటర్ల జాతీయ రహదారికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభం కావడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ జాతీయ రహదారి నిర్మాణం వల్ల రెండు రాష్ట్రాల మధ్య దూర భారం తగ్గుతుందని, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న భద్రాచలానికి ఇరు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు దూర భారం తగ్గించిన వారం అవుతామని పేర్కొన్నారు. అదేవిధంగా కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు అవుతున్నందున ప్రయాణికులకు కూడా మెరుగైన సౌకర్యం అందుతుందన్నారు. ప్రపంచంలో రెండవ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు అవుతుందని ఇక్కడికి వచ్చి చదువుకునే విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా సింగరేణి గనులకు కొలువై ఉన్న కొత్తగూడెంకు జగ్గయ్యపేట నుంచి జాతీయ రహదారి నిర్మాణం వల్ల ఇరు రాష్ట్రాల మధ్య వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి రాష్ట్ర మంత్రి తుమ్మల వివరించారు. ఖమ్మం కొరివి రోడ్డు నుంచి అమరావతి నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే కి ఏడు కిలోమీటర్ల లింకు రోడ్డు ను అనుసంధానం చేయాలని కోరారు. ఈ లింకు రోడ్డు వల్ల ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఖమ్మం చుట్టూ ఉన్న నియోజకవర్గాల ప్రజలు ఖమ్మం నగరానికి సులువుగా దూర భారం తగ్గించుకొని చేరుకోవడానికి వీలుంటుందని చెప్పారు. మంత్రి తుమ్మల అడిగిన జాతీయ రహదారుల పనులకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

## హైదరాబాద్‌లోని ఆ నాలుగు ప్రాంతాల్లో
# మాక్ డ్రిల్, ఎప్పుడంటే

**హైదరాబాద్, మే 7(నవభూమి ప్రతినిధి) :** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రికత్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని నాలుగు ప్రాంతాల్లో మాక్ డ్రిల్‌ను రక్షణ శాఖ బృందాలు నిర్వహించనున్నాయి. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్ బాగ్, మల్లాపూర్‌లోని ఎన్ఎఫ్‌సీలలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రక్షణ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది మరణించారు.

# వాస్తవాలు చెప్పారు

**ఆర్థిక పరిస్థితిని ధైర్యంగా వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి అభినందనీయులు**

- ❑ రేవంత్ రెడ్డిపై చేసిన అవాస్తవ వ్యాఖ్యలకు వెంటనే బుద్ధి చెప్పాలి
- ❑ కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను సమగ్రంగా చెబుతోంది
- ❑ కేసీఆర్ ఫాం హౌస్ పాలన, భద్రత పేరుతో ఖర్చు చేసిన వందల కోట్లు ఏమైపోయాయి
- ❑ టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



**కూకట్‌పల్లి, మే 6, (నవభూమి ప్రతినిధి) :** ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా, ప్రజలతో వాస్తవాలు నిగ్రహించి చెప్పడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధైర్యసాహసానికి నిదర్శనం అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. సోమవారం గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, బిఆర్ఎస్ కుట్రల ధోరణి కొనసాగుతోందని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగ సంఘాల తర్వాత ఇప్పుడు ఆర్టీసీ కార్మికులను రెచ్చగొట్టి ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలనే కుట్రలు జరుగుతున్నాయన్నారు. రెవంత్ రెడ్డి మాటల్లో వాస్తవాన్ని ఉద్యోగ సంఘాలు గుర్తించాలని కోరారు. సీఎం ప్రజల ముందే లెక్కలు వేసి ఏ పథకం ఆపాలంటే చెప్పండి' అని అడిగే స్థాయికి వెళ్లారు. ఇది గతంలో ఎప్పుడూ జరగలేదు. కేసీఆర్ పాలనలో ఉద్యోగ సంఘాలకు గొంతు ఉండేది కాదు. జీతాల విషయంలో ప్రశ్నించే స్థాయి కూడా లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు గతంలో సమ్మె చేసినప్పుడు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. వారు ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో కార్మికుల జీవితాలతో చెలగాటమాడారు. వాలంటరీ రిటైర్మెంట్ పేరుతో బలవంతపు ఒత్తిడి పెట్టారు. ఇప్పుడు ప్రభుత్వం వాస్తవాలను సమగ్రంగా చెబుతోంది. కానీ కొందరు ఇంకా అసంతృప్తిగా వ్యవహరిస్తుండడం విచార కరమన్నారు. కేటీఆర్ మీద విమర్శలు కొనసాగిస్తూ, రేవంత్ రెడ్డిపై చేసిన ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు ప్రజలను మరింత దూరం చేస్తాయే తప్ప, మద్దతు ఇవ్వమన్నారు. ఢిల్లీకి వెళ్లడమే ఖజానా ఖాళీకి కారణమంటే అది చిన్న జోక్. కానీ కేసీఆర్ ఫాం హౌస్ పాలన, భద్రత పేరుతో ఖర్చు చేసిన వందల కోట్లు ఏమైపోయాయి? అంటూ ప్రశ్నించారు. రెవంత్ రెడ్డిపై చేసిన అవాస్తవ వ్యాఖ్యలకు వెంటనే బుద్ధి చెప్పాలని డా. సత్యం డిమాండ్ చేశారు

# న్యాయం గెలిచింది

**కన్నీళ్లతో మెట్లెక్కానంటూ.. గుర్తు చేసుకున్న మాజీ మంత్రి సబిత**



**హైదరాబాద్, మే 7(నవభూమి ప్రతినిధి) :** ఓబులాపురం మైనింగ్ కేసులో తనను నిర్దోషిగా సీబీఐ కోర్టు ప్రకటించడం పట్ల మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆమెను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. తనను నిర్దోషిగా ప్రకటించిన కోర్టుకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. 12 ఏళ్ల పాటు ఈ కేసులో న్యాయం కోసం పోరాటం చేశానన్నారు. ఈ సందర్భంగా పలు అవమానాలు సైతం తాను ఎదుర్కున్నానని ఆమె గుర్తు చేసుకున్నారు. తనను చాలా మంది అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టారంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆ సమయంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఓబులాపురం మైనింగ్ కేసు నమోదయిన అనంతరం ఇదే సీబీఐ కోర్టుకు తాను కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కానని చెప్పారు. అయితే తనకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందన్నారు. తనపై రాజకీయంగా ఎన్నో ఆరోపణలు చేశారన్నారు. తాను అవినీతి చేశానని జైలుకు వెళ్తానంటూ హేళన సైతం చేశారన్నారు. ఇటువంటి నేపథ్యంలో తాను నిర్దోషినంటూ ప్రకటించడంతో కోర్టుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు

# కూకట్‌పల్లి జోన్‌లో మున్సిపల్ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ పర్యటన

- పలు అభివృద్ధి పనుల పరిశీలన, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు







**కూకట్‌పల్లి, మే 7(నవభూమి ప్రతినిధి) :** కూకట్‌పల్లి జోన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌ల నేతృత్వంలో అధికారులు పరిశీలించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్వహించిన ఈ పర్యటనలో నాలాల అభివృద్ధి, రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్ట్ పనులు, నాళాల పరిశీలన, ఐడీఎల్ చెరువు నుంచి కూకట్‌పల్లి బస్ డిపో వరకు ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్ట్ కింద చేపట్టనున్న నాలా నిర్మాణ పనుల ప్రదేశాన్ని కమిషనర్ కర్ణన్ పరిశీలించారు. మూసపేట మెట్రో సమీపంలో వర్షకాలంలో ఏర్పడే నీటి నిల్వలను గుర్తించి, వాటిని నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కైతాలాపూర్ రోడ్‌లో రోడ్డు వెడల్పు పనులను పరిశీలించిన ఆయన, అంబేద్కర్ నగర్ కోర్టు సముదాయంలో కూడా నీరు నిల్చే పరిస్థితులు లేకుండా చూడాలని సూచించారు. జలమండలి పైప్‌లైన్ ఉన్న ప్రాంతాల్లో సంబంధిత శాఖ అనుమతితో పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు.

**వైద్య, పౌర సదుపాయాల సమీక్ష**

కైలాస వాసం శ్మశానవాటిక నిర్వహణ, జంతు సంరక్షణ కేంద్రం, ఆపరేషన్ గదులను కమిషనర్ పరిశీలించారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేసిన కుక్కల గుర్తింపుపై ప్రస్తుతం ఉన్న చర్యల వివరాలను అధికారుల నుంచి కోరారు. షాపూర్‌లో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను, గాజుల రామారం జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను, అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను కూడా కమిషనర్ సందర్శించారు.

**ట్రాఫిక్ సమస్యలపై అపూర్వ్ చౌహాన్, ట్రాఫిక్ ఉన్న అధికారుల స్పందన**

కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ తో పాటు ట్రాఫిక్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా చొరవ తీసుకున్నారు. జేఎన్టీయూ %-% రాజీవ్ సర్కిల్ వద్ద రోజూ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలపై ట్రాఫిక్ శాఖతో కలిసి స్థల పరిశీలన చేశారు. జేఎన్టీయూ ప్రధాన గేటు వద్ద ఉన్న గోడను తొలగించి, ఫ్రీ లెఫ్ట్ మార్గాన్ని విస్తరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ తీవ్రత అధికంగా ఉండటంతో, ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు జేఎన్టీయూ యాజమాన్యంతో చర్చించినట్లు చెప్పారు. జోనల్ పరిధిలోని అన్ని ప్రధాన ట్రాఫిక్ సమస్యల గుర్తింపు, తగిన సూచన లతో ట్రాఫిక్ శాఖతో సమన్వయంతో పని చేస్తున్నామని జోనల్ కమిషనర్ వెల్లడించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, ట్రాఫిక్ డిసిపి గుణశేఖర్, అడిషనల్ డిసిపి వీరన్న, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జానయ్య లతో పాటు ఎస్ఈ చిన్నరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ఈఈ రమేష్, శ్రీనాథ్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు

# పార్కులో వాకర్స్ కార్పొరేటర్ రావుల శేషగిరి





**కుత్బుల్లాపూర్ - మే 6:(నవభూమి ప్రతినిధి)** గాజులరామరం మహాదేవపురం మౌంట్రిడ్జ్ స్కూల్ ప్రాంగణ నూతన పార్కులో వాకర్స్ తో బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఈ కార్యక్రమంలో జిల్లా మోర్చా ఓబీసీ ఉపాధ్యక్షులు లకోజి మురళీకృష్ణ ప్రబాత్ కుమార్ రమణ శ్రీకాంత్ రాము తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఈటల




**కుత్బుల్లాపూర్ - మే 6:(నవభూమి ప్రతినిధి)** బిజెపిదుండిగల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మున్సిపాలిటీ పరిది అన్ని గ్రామాలలో నెల కొన్న వివిధ ప్రజా సమస్యలు మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో సాంక్షన్ అయ్యి పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి అయ్యేలాగా చొరవ తీసుకోగలరని వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు డి ప్రభాకర్ రెడ్డి,మహిళా నాయకురాలు ఎన్ రోజా, కొమ్ము ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# 20న దేశవ్యాప్తంగా సమ్మెను జయప్రదం చేయాలి

**కుత్బుల్లాపూర్ - మే 6:(నవభూమి ప్రతినిధి)** మే 20 దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయడంలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశం ఈ రోజు టియుసిఐనాయకులు ప్రవీణ్ అధ్యక్షతన జరపడం జరిగింది గాంధీనగర్, జీడిమెట్ల పారిశ్రామిక వాడలో సమ్మెనోటీసులుఇండస్ట్రియల్ మున్సిపల్ కమీషనర్‌ని కలసి ఇవ్వడంజరిగింది 9/5/25 రంగారెడ్డి నగర్ శివాజీ విగ్రహం కూడలి నందు సాయంత్రం సదస్సు 16/5/25 జీడిమెట్ల డిపో నుండి పారిశ్రామిక వాడనందు బైక్ ర్యాలీ తో ప్రచారం చేయాలని నిర్ణయించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లకార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షులు హరినాధరావు, ఐఎన్ టియుసి యకులు ఐలయ్య, జనార్ధన్, సిఐటియు నాయకులు అశోక్, ఆంజనేయులు, ఐఎఫ్‌టియు యకులు శివప్రసాద్, పద్మ పాల్గొన్నారు

# కేపీహెచ్‌బి కాలనీలో దంపతుల అదృశ్యం

- క్షమించండి అనే లేఖతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన
- దర్యాప్తు చేపట్టిన కేపీహెచ్బీ పోలీసులు





**కూకట్ పల్లి, మే 6, (నవభూమి ప్రతినిధి) :** శనివారం ఉదయం వివాహానికి వెళ్తున్నామని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన దంపతులు అదృశ్యమవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. దీంతో కుటుంబ సభ్యులు కెపిహెచ్బి పోలీసులను ఆశ్రయించగా, మాన్, ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లి బలాజీ నగర్ కాలనీకి చెందిన సిద్ధబత్తుల అశోక్ అనే వ్యక్తి, తన అన్న సిద్ధబత్తుల శ్రీనివాస్ (50) మరియు అతని భార్య శోభ (45) శనివారం ఉదయం 10 గంటల సమయంలో తమ నివాసమైన ఇడబ్ల్యూఎస్ 336, 2వ అంతస్తు, రోడ్ నెం. 2, హెచ్ఎబీ కాలనీ నుంచి తెలిసినవారి వివాహానికి వెళు_న్నాం అని చెప్పి బయలుదేరినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే అదే రోజు మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో, వారి సోదరి ఖాంచనా కి ఏవో కారణాలతో క్షమించండి అంటూ పేర్కొన్న 7 పేజీల లేఖ వాట్సాప్ మెసేజ్ రూపంలో చేరినట్లు తెలిపారు. లేఖ విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే శ్రీనివాస్ ఫోన్ నంబర్ 9346685645, శోభ ఫోన్ నంబర్ 9398082984లకు ఫోన్ చేసినప్పటికీ రెండూ స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో అనుమానంతో కంగారుపడ్డారు. ఈ నేపథ్యంలో అశోక్ పోలీసులను ఆశ్రయించగా, కెపిహెచ్బి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అదృశ్య దంపతుల కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్టు సమాచారం. వారి ఇంటి పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలు పరిశీలిస్తూ, ఫోన్ల టవర్ లొకేషన్లు ట్రేస్ చేస్తూ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కాగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఎవరికైనా ఈ దంపతుల సమాచారమేమైనా తెలిస్తే కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ (ఫోన్: 040-23062433) ని సంప్రదించవలసిందిగా కోరారు.

# గండిపేటలో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఎకరం భూమి కేటాయింపు

**మణికొండ, మే 6, (నవభూమి ప్రతినిధి) :** హైదరాబాద్ గండిపేట పరిధిలో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం గండిపేట మండల పరిధిలోని మంచిరేవుల గ్రామ సర్వే నంబర 281లో ఎకరం భూమిని విద్యుత్ శాఖకు కేటాయించారు. ఇందులో భాగంగా సర్వే చేపట్టి ఎకరం భూమి హద్దురాళ్లను నాటి విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ సమక్షంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో పంచనామా చేసి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఈ అంబేద్కర్ మాట్లాడుతూ.. నగర శివారు ప్రాంతంలోని నార్సింగి, కోకాపేట, మంచిరేవుల, గండిపేట లాంటి ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జాబితాలో ఉన్నాయని తెలిపారు. ఇక్కడ దేశ నలుమూలల నుంచి ప్రజలు వచ్చి స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా ఇక్కడ వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వెలిశాయని అన్నారు. ఇక్కడి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు నూతనంగా మంచిరేవుల సమీపంలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

# విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలలో చండీ హోమం ఫల పుష్ప హిరణ్యధివాసాలు





**అల్వాల్, నవభూమి ప్రతినిధి, మే 6** : అల్వాల్ పట్టణ పరిధి సాయి సూర్య ఎంక్లేవ్, ఫేస్ -2, మురళీకృష్ణ కాలనీ, వాసవి టెంపుల్ రోడ్, (ఐస్ ఫ్యాక్టరీ రోడ్ లప్పం గోదాం సమీపంలో) మంగళవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి సమేత నగరేశ్వర స్వామి దేవస్థానం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు ముడవ రోజు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమానికి అతిధులుగా ఆలయ స్థపతి వేలు, ప్రముఖులు గౌరిశెట్టి మునిందర్, చంద నాగభూషణం హాజరయ్యారు. విగ్రహ ధాన్యాదివాస ఉత్తాపన, ప్రాతకాల పూజ, స్థాపిత దేవత మూలమంత్ర హవణములు చండీ హోమం, అన్న ప్రసాద వితరణ, ఫల పుష్ప హిరణ్య అధివాసములు ప్రదోష పూజ వేద స్వస్తి జరిపారు. సాయంత్రం నటరాజ్ ఆర్ట్స్ అకాడమీ వారిచే భరతనాట్యం ఉత్త ప్రదర్శన తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మరియు స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రతిష్టాపన చార్యులు బ్రహ్మశ్రీ తెగుళ్ల సనాతన సారథి కృష్ణ యజుర్వేద పండితులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిరిపురం ఆనందబాబు, ప్రొద్దుటూరు నాగేశ్వరరావు, అమర శ్రీను, ఉప్పల రాంబాబు, గంగాధర్, మంచాల రవీందర్, జి జగ్గయ్య, బచ్చు చంద్రశేఖర్, పెద్ది రమేష్, శివ, ఆలయ ధర్మకర్తలు, జీవిత సభ్యులు, దాతలు, మహిళలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు

# మచ్చ బొల్లారం శివగంగా కాలనీ విద్యుత్ సమస్య పరిష్కరించడానికి కృషి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్ ,నవభూమి ప్రతినిధి, మే 6:** మచ్చ బొల్లారం డివిజన్ శ్రీ శివగంగ ఫ్రెండ్స్ అసోసియేషన్ హనుమాన్ టెకుడి కాలనీవాసులు మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రాజశేఖర్ రెడ్డిని వారి కాలనీలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్య సింగిల్ ఫేజ్ టు త్రి ఫేస్ మార్చాలని, అంతర్గత రోడ్లను మరమ్మతులు చేయించాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖ ర రెడ్డి ని బోయిన్పల్లి లోని క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించగా వెంటనే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు డోలీ రమేష్, కాలనీ అధ్యక్షుడు బి.కే. శ్రీనివాస్, స్వరూపరాణి, శ్రీనివాస్, అనిత పాల్గొన్నారు

# ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న సత్యసాయి సేవా సంస్థలు

- సత్య సాయి బాబా తల్లి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా పేదలకు చీరల పంపిణీ









**కంటోన్మెంట్ , నవభూమి ప్రతినిధి, మే 6:** భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్య సాయిబాబా వారి మాతృమూర్తి శ్రీమతి ఈశ్వరమ్మ 48 వ వర్ధంతి సందర్భంగా జూబ్లీ బస్ స్టెండ్ ఆవరణ లో శ్రీ సత్య సాయి చలివేంద్రం, హైదరాబాద్ బాయ్స్ తెలంగాణ వారిచే గత కొన్నేళ్లుగా నిర్వహించిన బడినది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ డిపో, జేబీఎస్ సిబ్బంది, సెక్యూరిటి మరియు పారిశుధ్య మహిళా కార్మికులు కు చీరలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జేబిఎస్ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీమతి అశ్విని మాట్లాడుతూ సత్యసాయిబాబా వారి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు అవి జేబిఎస్ లో జరగడం చాలా సంతోషమని,ఈ సేవలన్నీ అందరికీ ఆదర్శమని తెలియజేశారు. జేబీఎస్ లో ఏర్పాటు చేసిన చలివేంద్రం వల్ల ప్రతిరోజు రమారమి పదివేల మంది దాహార్తిని తీరుస్తున్నదని ఇది చాలా సంతోషకరమైన విషయం అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య ఎస్. ఐ సెక్యూరిటీ విభాగం గారు సత్యసాయి సేవా సంస్థల ఉదయ్ భాస్కర్ ,హైదరాబాద్ బాయ్స్ తెలంగాణ సేవాదళ సభ్యులు పాల్గొన్నారు

# జేబీఎం చిల్డ్రన్స్ క్యాంప్‌లో విజయం సాధించిన పునీత్‌ను అభినందించిన బండి రమేష్

- చిన్నపిల్లల్లో నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందడానికి జేబీఎం వేదికలు ఉపయోగపడతాయి
- పిల్లల్ని ప్రోత్సహిస్తూ, ఉత్తమ పౌరులుగా సహాయపడుతున్న సునీల్ కుమార్ కృషిని అభినందించిన నిర్వాహకులు





**కూకట్ పల్లి, మే 6, (నవభూమి ప్రతినిధి) :** జవహర్ బాల్ మంచ్ (జేబీఎం) రాష్ట్ర కోఆర్డినేటర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన చిల్డ్రన్స్ క్యాంప్-2025 లో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగిన పిల్లల ఎన్నికలలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి వైస్ ప్రెసిడెంట్‌గా గెలుపొందిన పునీత్‌ను కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, చిన్నపిల్లల్లో నేతృత్వ లక్షణాలు అభివృద్ధి చెందడానికి జేబీఎం వంటి వేదికలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పిల్లలలో రాజ్యాంగ పరమైన అవగాహన పెంచేందుకు జేబీఎం చేపట్టిన కార్యక్రమాలు ప్రశంసనీయమని చెప్పారు. జవహర్ బాల్ మంచ్ చేపడుతున్న తిత్లీ యూనిట్లు పిల్లల అభివృద్ధికి దోహదపడుతున్నాయని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారు సరదాగా, సృజనాత్మకంగా తమ లక్ష్యాలను చేరుకునేలా మార్గదర్శనం అందించవచ్చని పేర్కొన్నారు. క్యాంప్ సందర్భంగా తిత్లీ యూనిట్‌కి చెందిన పిల్లలు బండి రమేష్‌ను కలిసి సానుభూతి పంచుకున్నారు. సునీల్ కుమార్ యాదవ్ పిల్లల్ని ప్రోత్సహిస్తూ, ఉత్తమ పౌరులుగా ఎదగాలన్న ఆశయంతో ముందుకు సాగుతున్నారని క్యాంప్ నిర్వాహకులు అభినందించారు

# సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఖమ్మం కలెక్టరేట్, నవభూమి, మే 6:** మే 18 లోగా మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కీసర రాంగోపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోర్సులలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనాధలు, నిరాశ్రయులైన ఆడపిల్లలు, అక్రమ రవాణాకు గురైన బాధితులు, బాలల సదనం, మహిళ సంస్థల్లో ఆశ్రయం పొందిన బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, పదవ తరగతి పాసైన బాలిక అభ్యర్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాయని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుతో పాటు జత చేసి, జిల్లా కలెక్టరేట్ లోని మహిళా, ప్రకటనలో పేర్కొన్నారు

## వర్షాకాలంలోపు మురికి నీటి కాలువలు అన్నింటిలో పూడికలు తీసివేత

### మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్





**అల్వాల్, నవభూమి ప్రతినిధి, మే 6:** 133 డివిజన్ మచ్చ బొల్లారం కుట్టియ్య టెంపుల్ దగ్గర కొనసాగుతున్న పూడికతీత పనులను డీసెల్టింగ్ పరిశీలించిన కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్. రానున్న వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు సాఫీగా పోయేందుకు పూడికతీత పనులను కొనసాగిస్తున్నారు ఈ కార్యక్రమంలో డి ఈ రఘు ఏఈ రవళి అఫ్రోజ్ విగ్నేష్ హరిబాబు డివిజన్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి వెంకటేష్ ఆనంద్ దేవేందర్ వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## నేడు విద్యుత్ సౌకర్యానికి అంతరాయం



**మేడ్చల్ - మే 6: (నవభూమి ప్రతినిధి)** గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ 11 కెవి, సాయి గీత ఆశ్రమం ఫీడర్ కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్సరఫరా నిలిఎ ి వేస్తున్నట్లు గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏ ఇ కే విజయ్ కుమార్ తెలిపారు. దీనివల్ల కండ్లకోయ, కండ్లకోయ ప్రధాన రహదారి, సుతారి కూడా గ్రామం, రైల్వే ట్రాక్ రోడ్డు, సర్వీస్ రోడ్డు, సోమినాయ పరిశ్రమ, లక్ష్మీ ఇన్ఫో, ప్రసాద్ పార్క్, జయదర్శిని, గీతాంజలి పాఠశాల వరకు విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందని ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఏ ఈ కే విజయ్ కుమార్ తెలిపారు

## జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

**ఖమ్మం లీగల్, నవభూమి, మే 6:** జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక లోక్ అదాలత్ జూన్ 9 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మే 5 నుంచి 19 వరకు ముందస్తు లోక్ అదాలత్ ను జిల్లాలోని అన్ని కోర్టులలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రత్యేక లోక్ అదాలత్ లో ఇరు వర్గాల లేదా ఒక పక్షం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే అందుకు సంబంధించిన కేసు వివరాలు పరిశీలించి , ఇరుపక్షాల వారిని పిలిపించి ఇరుపక్షాల సమక్షంలో, వారి న్యాయవాదుల సమక్షంలో మధ్యవర్తిత్వం నిర్వహించి ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నం జరుగుతుందని అన్నారు.

# మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె: సిఐటియు

- నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయొద్దు
- కార్మికులను బానిసలుగా మార్చొద్దు
- ఎం చంద్రశేఖర్ సిఐటియు జిల్లా నాయకులు



**కుత్బుల్లాపూర్ - మే 6: (నవభూమి ప్రతినిధి)** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు ఉద్యోగులు మే 20 వ తేదీ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుప తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటారని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారి సక్కుబాయి మేడమ్ కి సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక 20 మే 2025 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇచ్చిందన్నారు. మే 20 జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చింది అన్నారు. నాలుగు లేబర్ కోడ్ల అమలును రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సిబ్బంది పర్మినెంట్ రెండవ పిఆర్సి లో కనీస వేతనం 26,000గా నిర్ణయించాలని కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకపోయింది అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెబుతున్నప్పటికీ ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. లోయర్ లెవెల్ మినిమం వేజ్ ప్రకారం రోజుకు ?178/బి రూపాయలు నెలకు ?4576/బి రూపాయలు వేతనాన్ని ఇస్తే చాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం అత్యంత దుర్మార్గం అన్నారు. అంతేకాకుండా వేతనంతో కూడిన సెలవులు పండుగ సెలవులకు వేతనాలను చెల్లించే విధానాన్ని మినహాయించిందన్నారు. కార్మిక వర్గం ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని నీరుగార్చి 12 గంటల పని విధానాన్ని అమలు చేయటానికి పూనుకుంటుంది అన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇండ్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పట్టణ విస్తరణకు అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని కోరారు.

పెండింగ్ వేతనాలు గురించి కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించిన సందర్భంగా మే రెండో తేదీ నాటికి రెండు మాసాల కార్మికుల వేతనాలు చెల్లిస్తామని కమిషనర్ హామీ మేరకు మేనేజర్ పవన్ కుమార్ యూనియన్ నాయకులకు , కార్మికులకు వెల్లడించడం జరిగింది. కానీ ఒక్క మాసం వేతనం మాత్రం చెల్లించి, రెండో నెల వేతనం చెల్లించకపోవడం కార్మికులను అవమానించి నిర్లక్ష్యం వహించినట్లుగా యూనియన్ భావిస్తుందన్నారు. వెంటనే రెండో నెల వేతనం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగశేషు చిన్న నరసింహ మన్యం గురవయ్య యాదగిరి ఈశ్వరయ్య చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు

# షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం,

## కాలిపోయిన ఖరీదైన వస్తువులు, కట్టుబట్టలతో బాధితులు







**కుత్బుల్లాపూర్ - మే 6: (నవభూమి ప్రతినిధి)** షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో అగ్ని ప్రమాదం సంబంధించి ఖరీదైన వస్తువులు కాలిపోయిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో బ్లాక్ నెంబర్ 13 ఫ్లాట్ నెంబర్ 24 లో నివసించే వెంకన్న అమీనా దంపతులు ముగ్గురు పిల్లలతో నివసిస్తున్నారు. వెంకన్నకూకట్పల్లిజోనల్కార్యాలయంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ ఉండగా అమీనా కెపిహెచ్బి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈరోజు ఉదయం 5 గంటల 20 నిమిషాలకు కొడకండ్లకు వెళ్లాలని కుటుంబంతోపాటు అందరూ బయలుదేరి బస్టాండ్ కు వెళ్లారు. ఇంతలో సుమారు 6గంటలప్రాంతంలో ఇంట్లో నుండి అగ్నిప్రమాదం సంభవించి పొగలు బయటికి రావడంతో చుట్టుపక్కల వారు గమనించి బాధితులకు ఫోన్ చేయడంతో తిరిగి ఇంటికి చేరుకున్న బాధితులకు ఇంట్లో అగ్నిప్రమాదం సంబంధించి ఖరీదైన టీవీ బ్రిడ్జి వాషింగ్ మిషన్ తో పాటు కట్టుకునే బట్టలు కూడా కాలిపోవడంతో బాధితులు లబోదిబో అంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలిస్తున్నారు. విషయం తెలుసుకున్న సొసైటీ మాజీ అధ్యక్షులు ప్రభాకర్, ఎర్ర యాకన్న, పరుశురాములు, వెంకట్ లు సంఘటన స్థలాన్ని చేరుకొని బాధితులను పరామర్శించారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఇతర ఎన్జీవోల దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు సహాయ సహకారాలు అందించాలని పలువురు కోరుతున్నారువీ

# కెపిహెచ్బిలో వైద్యుల నిర్లక్ష్యంతో వృద్ధురాలి మృతి

- మెడ్‌క్వెస్ట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌పై కేసు నమోదు



**కూకట్‌పల్లి, మే 6 (నవభూమి ప్రతినిధి)** :రెండు రోజులుగా జలుబుతో బాధపడుతున్న వృద్ధురాలి మృతికి వైద్య నిర్లక్ష్యం కారణమని ఆరోపణలతో కూకట్‌పల్లి మెడ్‌క్వెస్ట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌పై కేసు నమోదైంది. ఈ సంఘటన కేపిహెచ్బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాగూడకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి సిస్ట వెంకట అభిషేక్ (34) తన తల్లి సిస్ట సూర్యలక్ష్మి (66) మే 6న సిటీ సిస్టెనోగ్రఫీ పరీక్ష కోసం మెడ్‌క్వెస్ట్ సెంటర్‌కు తీసుకెళ్లారు. పరీక్షకు ముందు కాంట్రాస్ట్ డ్రగ్‌ని డయాగ్నోస్టిక్ సిబ్బంది మానవీయ జాగ్రత్తలు లేకుండా ఇచ్చారని, దీని వల్ల కార్డియాక్ అరెస్టు సంభవించిందని బాధితుని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మెడికల్ ప్రాసెస్ గురించి ముందుగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, తల్లి అలర్జీ ఉందా లేదా అని నిర్ధారణ చేయకుండా మందు ఇచ్చారని ఆరోపించారు. కార్డియాక్ అరెస్టు అయిన తర్వాత తగిన వెంటిలేటరీ సౌకర్యాలు లేకుండా, వెంటనే ఇంటుబేషన్ చేయకపోవడం, ఫ్యామిలీ సభ్యులపై సమయానికి ఒప్పందం లేదని ఆరోపణలు చేయడం, స్పందనలో గందరగోళంగా ఉండి...సమయాన్ని వృధా చేశారని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడం, సిబ్బందికి సరైన శిక్షణ లేకపోవడం, అత్యవసర పరిస్థితి కి తగిన విధంగా ఆస్పత్రి సిబ్బంది స్పందించలేకపోవడం వల్ల...చివరికి బాధితురాలిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా బ్రాట్ డెడ్ గా ప్రకటించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బాధితుడు సిస్ట అభిషేక్ కేపీహెచ్బీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును ఎస్సై కె. లింగం విచారిస్తున్నారు. వైద్య నిర్లక్ష్యం, తగిన అనుమతులు లేకుండా చికిత్స చేయడం వంటి అంశాలపై విచారణ జరుగుతోంది. కాగా కుటుంబ సభ్యులు బాధ్యత వహించిన డయాగ్నోస్టిక్ సెంటర్ మేనేజ్‌మెంట్, వైద్య సిబ్బంది మీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వేసవి సెలవుల్లో హాస్టల్ అవసరం విద్యార్థుల పక్షాన నిలుస్తున్న ఎస్ఎఫ్ఐ

**కుత్బుల్లాపూర్ – మే 6 (నవభూమి ప్రతినిధి)** వేసవి సెలవుల సమయంలో హాస్టల్ మూసివేత వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై స్పందించిన ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా, ఎస్ పిఆర్టియు నిట్ నాయకత్వంలో విశ్వవిద్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రాన్ని జిల్లా కార్యదర్శి కార్తిక్, విశ్వవిద్యాలయ కార్యదర్శి పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షుడు భాగత్, యూనిట్ నాయకుడుఅరుణ్కలిసియూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. తలవండ్ల నిత్యానంద రావుకి రిజిస్ట్రార్ శ్రీ కోళ్ల హనుమంత్ రావుకి అందజేశారు. వారు తమ వినతిలో వేసవి సెలవుల్లో కూడా హాస్టల్ అవసరం ఉండే విద్యార్థుల పరిస్థితులను స్పష్టం చేశారు. పోటీ పరీక్షలైన ఎన్ఎఫ్టి, టిపిఎస్సి, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు విశ్వవిద్యాలయంలో నేతలదాచుకోగల స్థలాన్ని ఆశ్రయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే డిజైన్ విభాగానికి చెందిన విద్యార్థులు తమ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాల్సి ఉండటం వల్ల హాస్టల్ అవసరం తీరని ముప్పుగా మారుతోందని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, తమ తమ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. కొంతమంది విద్యార్థులు కుటుంబ పరిస్థితులవల్లఇంట్లోచదువుకోవడానికి అనువైన వాతావరణం లేనిదే చదువునుకొనసాగించలేకపోతున్నారు.ఈ నేపథ్యంలో తాత్కాలిక హాస్టల్ వసతి అందించడం లేదా తక్కువ ఖర్చుతో షెల్టర్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల అవసరాలు తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమస్యలను గౌరవించి వెంటనే స్పందించాలని, చదువుకి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

## మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

### బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్ – మే 6:(నవభూమి ప్రతినిధి)** మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా నియమితులైన లక్ష్మీ నారాయణ మున్నూరు కాపు సంఘం కుల బంధువులు నిన్న సాయంత్రం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగాకలిసిపూలమాల, శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ..2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించి నా గెలుపులో అత్యంత కీలకంగా వ్యవహరించిన "మున్నూరు కాపు" సంఘం కుల బాంధువులందరికీ ఎల్లవేళలా రుణపడి ఉంటానని, మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. మున్నూరు కాపు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన లక్ష్మీ నారాయణ కి సంఘం బలోపేతం, డిమాండ్లను సాధనలో మంచి అవగాహన ఉందని అన్నారు. కుల బంధువులు, సంఘ సభ్యుల సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతంచేసేదిశగాపనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి లోని ఎనిమిది డివిజన్లు, నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీ ప్రాంతాలకు చెందిన వివిధ సంఘాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# సంధ్య కన్వెన్షన్‌లో హైడ్రా కూల్చివేతలు

- ఎఫ్‌సిఐ లేఔట్‌లో అక్రమ నిర్మాణాల నేలమట్టం
- సంధ్య మినీ హాల్, కిచెన్, ఫుడ్ కోర్ట్ షెడ్ల తొలగింపు

**శేరిలింగంపల్లి ప్రతినిధి–నవభూమి, మే 6:** గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్ కు చెందిన పలు అక్రమ షెడ్లను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కూల్చివేసింది. మంగళవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికారులు, సిబ్బంది మూడు భారీ హైడ్రాలిక్ యంత్రాలతో షెడ్లు, సీసీ రోడ్లను తొలగించారు. త్రిబుల్ ఐటీ చౌరస్తా వద్ద డిఎల్ఎఫ్ పక్కన ఉన్న సంధ్య కన్వెన్షన్ కు చెందిన మినీ హాల్ షెడ్, కిచెన్ షెడ్, రెస్ట్ రూమ్ షెడ్లు, ఇతర షెడ్లను నేలమట్టం చేశారు. జి ప్లస్ టు అంతస్తులుగా నిర్మించిన మూడు షెడ్లు, ఫుడ్ కోర్టులను కూల్చివేశారు. ప్లాట్లు, పార్కులను నామరూపాలు లేకుండా చేసి అక్రమంగా వేసిన సిసి రోడ్లను ధ్వంసం చేశారు. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్లు 124, 127లలో గల 20 ఎకరాలలో ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరున 162 ప్లాట్లతో గతంలో లేఔట్ చేశారు. కాగా ఈ లేఔట్ లోని ప్లాట్ల హద్దులు, పార్కు స్థలాలు ఆనవాళ్లు లేకుండా చేసి ఇటీవల అక్రమంగా భారీ షెడ్లు నిర్మించారు. గతంలో శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొంతమేర కూల్చి వదిలేశారు. ప్లాట్ల యజమానులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో పరిశీలించిన అధికారులు కూల్చివేతలు చేపట్టారు. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేపట్టగా సంధ్యా కన్వెన్షన్ యాజమాన్యం బెదిరింపులకు పాల్పడి కూల్చివేతలను అడ్డుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలను, భారీ షెడ్లను హైడ్రా కూల్చివేయడంతో ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోపరేటివ్ సొసైటీ ప్లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేశారు










# ఆర్థిక మందగమనం కొనసాగుతోంది

- రియల్ ఎస్టేట్ కుదేలవుతుంది
- బ్యాంకులు లోన్లకు నో చెబుతున్న పరిస్థితి
- కూకట్‌పల్లి యువ కాంగ్రెస్ నేత గాదె శివ చౌదరి



**కూకట్‌పల్లి, మే 6, (నవభూమి ప్రతినిధి) :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గత మూడు సంవత్సరాలుగా తీవ్ర మందగమనాన్ని ఎదుర్కొంటోందని కూకట్పల్లి యువ కాంగ్రెస్ నేత గాదె శివ చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, చైనా, యూకే, రష్యా వంటి ప్రపంచ ఆర్థిక శక్తులు కూడా దివాలా స్థితిలోకి చేరగా, పాకిస్తాన్ లాంటి చిన్న దేశాల ఆర్థిక స్థితిగతులు పూర్తిగా కుప్పకూలై అన్నారు. ఈ ప్రభావం భారత్ మీద కూడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సాఫ్ట్‌వేర్ రంగం, రియల్ ఎస్టేట్ రంగం, బ్యాంకింగ్ వ్యవస్థ... అన్నిటిపైనా ఈ ఆర్థిక వర్షం పడిందన్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో ఇంటి పునాదులు పడకముందే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బిల్డర్ పేరుతో సంబంధం లేకుండా ఫ్లాట్లు బుక్ చేసుకునే స్థితి ఉండేది. బ్యాంకులు అప్పట్లో సిబిల్ స్కోర్ పట్టించుకోకుండా, పర్మిషన్లు లేకపోయినా లోన్లు ఇవ్వడానికి పోటీపడేవన్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా తారుమారైందని, కంపెనీలు ప్రాజెక్టులు రద్దు చేస్తుండగా, ఉద్యోగాలు తగ్గుతున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలు రావడం లేదు, వేతనాల పెరుగుదల కనిపించడం లేదు. దాంతో ఐటీ ఉద్యోగులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. ఫార్మా రంగంలోనూ పరిస్థితి మెరుగ్గా లేదన్నారు. పెట్టుబడిదారులు వెనకడుగు వేయడంతో రియల్ ఎస్టేట్ మార్కెట్ కుదేలవుతోంది. బ్యాంకులే దివాలా భయంతో లోన్లకు మొహం చాటుతున్నాయి. సిబిల్ స్కోర్ ఉన్నప్పటికీ అప్పు మంజూరు అవ్వడంలేదు. దరఖాసుదారులకు సాంకేతిక కారణాలు చెబుతూ బ్యాంకులు తిరస్కరిస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిస్థితి కూడా భిన్నంగా లేదు. సిబిల్ స్కోర్ బాగుండి కూడా బ్యాంకులు లోన్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని గాదె శివ చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో తెలంగాణలో తీసుకున్న భారీ అప్పులు పూర్తిగా సంక్షేమ పథకాలకే వినియోగించారు. ఆదాయాన్ని పెంచే విధంగా రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. దీనివల్ల ఆ అప్పులు తిరిగి రెవెన్యూ ఇవ్వలేని భారం అయ్యాయి అని ఆయన అన్నారు. అంతేకాక, గత మూడు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సరైన విధంగా నిధులు కేటాయించకపోవడం వల్ల బ్యాంకులకు మరిన్ని అనుమానాలు వచ్చాయని, అందుకే లోన్లు ఆపివేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. డబ్బు ఉన్నప్పుడు ఎలా ఉన్నామో, డబ్బు లేనప్పుడు అలాగే ఉండకూడదు. ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని ముందుకు సాగేవాడే నిజమైన ఆర్థిక బలవంతుడు అంటూ శివ చౌదరి వ్యాఖ్యానించారు

# మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలపై 12న ధర్నా

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి. సత్యం**




**మేడ్చల్- మే 6:(నవభూమి ప్రతినిధి)-** మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్నసమస్యలనుపరిష్కరించాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ను నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి. సత్యం తెలిపారు.మేడ్చల్ మండలంలోని ప్రభుత్వ హాస్పిటల్ ని సిపిఎం పార్టీ బృందం పర్యటించారు . ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ మేడ్చల్ మండలంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ లో అనేక సమస్యలు ఉన్నాయని ప్రధానంగా భవన సమస్య, డాక్టర్ల సమస్య ఉన్నాదని తెలిపారు. ఇక్కడ పనిచేసే ఏడుగురు డాక్టర్లు డిప్యూటేషన్ మీద వచ్చిన వారేనని,పర్మనెంట్ డాక్టర్ ఒక్కరు లేరని ఆరోపించారు. 5గురు నర్సులతో హాస్పిటల్ ని ఎలా నిర్వహిస్తారు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు, వెంటనే పర్మినెంట్ డాక్టర్లను నర్సులను రిక్రూట్మెంట్ చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, అదేవిధంగా ఈ హాస్పిటల్ లో ప్రధానంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు, గతవారం వచ్చిన పిడుగుకు ట్రాన్స్ఫారం కాలిపోవడంతో పాటు హాస్పటల్లో ఉన్నటువంటి వైర్లు అన్ని షార్ట్ సర్క్యూట్ తోని కాలిపోయినాయి కాబట్టి వెంటనే కరెంటు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు, ఈ సమస్యలపైన ఈనెల 12వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు, ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి ఎంపీ. నరేష్, నాయకులు డి.నర్సింగ్ రావ్, ప్రశాంత్, రమేష్, కొమురయ్య, చెంద్రశేఖర్, అశ్విని, పూజ, నర్సింగ్ రావ్, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, ప్రేమలత పాల్గొన్నారు

# శేరిలింగంపల్లి నూతన జడ్సీకి పుష్పగుచ్ఛం

**కొత్త డిప్యూటీ కమీషనర్‌కు శాలువతో సత్కారం**

**శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**





**శేరిలింగంపల్లి ప్రతినిధి-నవభూమి, మే 6:** జిహెచ్ఎంసి శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన భోర్కడే హేమంత్ సహదేవరావుకు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శేరిలింగంపల్లి సర్కిల్-20 డిప్యూటీ కమీషనర్ వి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే ఇచ్చిశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి జోనల్ కమీషనర్ తో చర్చించానని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు

# యూనివర్సిటీ క్యాంపస్‌లోకి రాకపోకలకు రివాల్వింగ్ గేట్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

- **ఉన్నతాధికారులకు స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు వినతి**



**కూకట్‌పల్లి, మే 06, (నవభూమి ప్రతినిధి) :** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జెఎన్టీయూహెచ్) మెట్రో స్టేషన్ నుంచి నేరుగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి రాకపోకలు సులభతరం చేయాలన్న ఉద్దేశంతో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం రివాల్వింగ్ గేట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. అలాగే, ప్రధాన ద్వారం వద్ద రోజూ ఎదురవుతున్న అధిక ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు.మంగళవారం విశ్వవిద్యాలయ డిస్పాచ్ విభాగం ద్వారా ఉన్నతాధికారులకు ఈ మేరకు వినతిపత్రం పంపినట్లు ఫోరం తెలిపింది. రోజూ వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు మెట్రో రైలు ద్వారా వస్తున్నారని, కానీ మెట్రో స్టేషన్ నుండి క్యాంపస్ వరకు రెండు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల విద్యార్థులు మొదటి తరగతిని కోల్పోతున్నారని, అలసటతో తరగతులకు తగ్గ మట్టుకు దృష్టి పెట్టలేకపోతున్నారని ఫోరం నాయకులు పూల అరవింద్ కుమార్, గోపాల చంద్రశేఖర్ తెలిపారు.గతంలో ఇన్‌చార్జి ఉపకులపతిగా పనిచేసిన బాలకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడం పట్ల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన ద్వారం వద్ద రోజూ తీవ్రమైన ట్రాఫిక్ ఉండటంతో రోడ్డు దాటే విద్యార్థులు, సిబ్బంది ప్రమాదానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి అవసరం చాలా తప్పనిసరైనదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు శివకృష్ణ, బ్రహ్మం గౌడ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు

# కాలనీలలో అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు

- **వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు**





**కూకట్‌పల్లి, మే 06, (నవభూమి ప్రతినిధి) :** కాలనీలలో అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్‌లో గల కమల ప్రసన్న నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, రంగారావు లు ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించి జీహెచ్ఎంసి , హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ అధికారులతో కలిసి కాలనీలో పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని రోడ్ నెంబర్లు 12, 13 లలో సివరేజ్ లైన్లు చిన్నవిగా ఉండటంతో తరచూ మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందని, ఇది ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోందని తెలిపారు. ప్రస్తుతం మాన్యువల్ క్లీనింగ్ జరుగుతున్నప్పటికీ ఇది తాత్కాలిక పరిష్కారమని, ముందుగా ఒక అడుగు వెడల్పుతో కొత్త సివరేజ్ లైన్ వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిపాదన మంజూరు చేయించామని, త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో సిమెంట్ రోడ్డుకు మంజూరు లభించిన విషయాన్ని ఆమె వెల్లడించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరగా రోడ్డు పనులు ప్రారంభించాల్సిందిగా జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ఈ పాదయాత్రలో హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ మేనేజర్ ప్రియాంక, జిహెచ్ఎంసి అధికారులు నిఖిల్, కాలనీ అధ్యక్షులు శేఖర్, రాఘవులు, ఆంజనేయులు, రాజు, శ్రీశైలం గౌడ్, రాము, తిరుపతి, బండప్ప తదితరులు పాల్గొన్నారు.

# సహాయ నిధి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలి

- **గడ్డ మల్లయ్య గూడ మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి**
- **లబ్ధిదారులకు సహాయనిధి చెక్కుల అందజేత**



**ఇబ్రహీంపట్నం, మే 6 (నవభూమి ప్రతినిధి):** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి గడ్డ మల్లయ్య గూడ మాజీ సర్పంచ్ గుండ్లపల్లి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. యాచారం మండల పరిధిలోని గడ్డమల్లయ్య గూడం గ్రామానికి చెందిన వరికుప్పల నరసింహ రూ. 60 వేలు, మైలారం అనసూయ రూ.14 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం గుండ్లపల్లి సురేందర్ రెడ్డి తో పాటుగా కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే కు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇక్కె మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ యార అశోక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇక్కే శరమంద, ఆవ బీరప్ప, పాండు రంగారెడ్డి, అచ్చన యాదయ్య, వరికుప్పల శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడు అదృశ్యం



**కూకట్‌పల్లి, మే 6 (నవభూమి ప్రతినిధి)** : వాకింగ్‌కు వెళ్లిన ఓ రిటైర్డ్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం%ౌ%కూకట్‌పల్లి వెంకట్రావు నగర్‌లో నివాసముండే కొల్ల చెంచా రావు (63) అనే రిటైర్డ్ ఉద్యోగి మంగళవారం ఉదయం లాగే కాలనీలోని పార్కులో నడకకు వెళ్లారు. అయితే గంటలైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గంటల పాటు చుట్టుపక్కల, బంధువుల వద్ద విచారణ చేసినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన కోడలు గీతిక సృజన పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చేంచారావు కోసం గాలింపు చర్యలు ప్రారంభించినట్టు తెలిపారు. పార్కు పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు

## రోడ్లపై అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తాం: బాలానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్



**అల్లాపూర్, మే 6 (నవభూమి ప్రతినిధి)** : రోడ్లను ఆక్రమించి ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తే చలానాలు విధించడంతోపాటు, కేసులు కూడా నమోదు చేస్తామని బాలానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సురేశ్ హెచ్చరించారు. మంగళవారం మోతీ నగర్ పరిధిలోని కబీర్ నగర్, అవంతినగర్ కాలనీల్లో అంతర్గత రోడ్లపై అక్రమంగా వాహనాలను పార్క్?? చేసిన వారిపై ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సురేశ్ మాట్లాడుతూ.. రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల ట్రాఫిక్ స్తంభించే అవకాశాలు ఉంటాయని అన్నారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని, వాహనాల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. ఎంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో వాహనదారులు అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేయడం వలన ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని చెప్పారు.

## మాలల మహా రణభేరి సభను జయప్రదం చేయండి: పిలుపునిచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

**ఎల్బీ నగర్, మే 6 (నవభూమి ప్రతినిధి)** : ఈ నెల 12వ తేదీన ఏపీలోని కాకినాడలో నిర్వహించనున్న మాలల మహా రణభేరి సభను జయప్రదం చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి పిలుపునిచ్చారు. మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు 73వ జయంతి సందర్భంగా మే 12న కాకినాడ లో జరిగే మాలల మహా రణభేరి పోస్టర్ ను తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి చెన్నయ్య, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ పండు అశోక్ తో కలిసి హైదరాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో చెన్నూరు శాసనసభ్యులు డాక్టర్ జి వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. మాలల మహా రణభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాలలు ఒక్కతాటిపైకి రావాలని కోరారు.

# 1రైల్వే రంగాన్ని ప్రైవేటుపరం చెయ్యొద్దు

### ■ మేడ్చల్ రైల్వే స్టేషన్ ముందు సిఐటియు ధర్నా

**మేడ్చల్- మే 6:(నవభూమి ప్రతినిధి)-** రైల్వే రంగాన్ని ప్రైవేటుపరం చేయొద్దని సిఐటియు ఆధ్వర్యంలో మేడ్చల్ రైల్వే స్టేషన్ ముందు సిఐటియు నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ ఎం.నరేష్ మాట్లాడుతూ తక్కువ ఖర్చు గల రవాణా మార్గం, రైలు ప్రయాణం సాహిన్య ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, ముఖ్యంగా వలస కార్మికుల జీవితాలతో విడదీయలేనిదన్నారు. రోజుకు కోటీ యాభై లక్షల మందికి రవాణ సౌకర్యంగా ఉన్న రైల్వే రంగాన్ని పటిష్టంగా అమలు జరపకుండా ప్రభుత్వం బాధ్యత నుండి తప్పించుకుంటోందని ఆరోపించారు. కోవిడ్ తరువాత సాధారణ పాసెంజర్ రైళ్ల ను బాగా తగ్గించారని సుమారు 160 సర్వీసులు నిలిపివేశారని ఎక్స్ ప్రెస్ రైళ్లలో సాధారణ కంపార్ట్మెంట్ల సంఖ్య తగ్గిపోయిందని. వాటిస్థానంలో వందేభారత్ రైళ్లు డైనమిక్ ఛార్జీలు వంటి ఖరీదైన రైళ్లు ప్రవేశపెట్టారు విమర్శించారు. సీనియర్ సిటిజన్లు, పిల్లలు, వికలాంగులు మొదలైన వారికి ఇచ్చే రాయితీలు తొలగించబడ్డా యని రైల్వే స్టేషన్లు, రైళ్లు, ట్రాక్లు మొదలైనవి. గూడ్స్ షెడ్లు మొదలైన వాటి నిర్వహణ, పరిపాలన ప్రైవేటు కాంట్రాక్టర్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. 90 శాతం రైళ్లు, రైల్వేస్టేషన్లలో కనీస వసతులు లేవని. చర్లపల్లి వంటి రైల్వేస్టేషన్ లను అధునీకరించి సర్వీస్ చార్జీల పేరుతో దిగువ మధ్యతరగతి, సామాన్య ప్రజలపై, భారాలు మోపుతున్నారని.




పార్కింగ్ ఫీజులు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొందని అన్నారు. రైల్వే ప్రైవేటికరణ వల్ల సరుకు రవాణా ఛార్జీలు పెరగటంతో వస్తువుల ధరలు పెరుగుతాయని. భద్రత పట్ల నిర్లక్ష్యం, కార్పొరేట్లకు లాభాలు పెంచటం కోసం రైల్వేలను కేంద్ర ప్రభుత్వం బరితెగించి ప్రైవేటీకరిస్తున్నదని ఆరోపించారు, రైల్వేల ప్రైవేటీకరణను ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కే.నర్సింగ్ రావు, ప్రశాంత్, రమేష్, కొమురయ్య, చెంద్రశేఖర్, ప్రేమలత, విజయలక్ష్మి, పూజ, వసంత, జ్యోతి, లత, మహేశ్వరి, చంద్ర, నాగలక్ష్మి పాల్గొన్నారు

# సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత

### ■ పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ






**శేరిలింగంపల్లి ప్రతినిధి-నవభూమి, మే 6:** ప్రజా సంక్షేమం, అభివృద్ధికై ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని స్ప్రింగ్ వ్యాలీ కాలనీలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులకు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి పిఏసీ చైర్మన్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, చింతకింది రవీందర్ గౌడ్, బి.గోపాల్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# వన్ డే సైంటిస్ట్ ప్రొగ్రామ్, ఈ విద్యార్థులకు మంచి ఛాన్స్

**హైదరాబాద్, మే 7(నవభూమి ప్రతినిధి)** : సమ్మర్ హాలిడేస్ విద్యార్థులకు ఎంతో స్పెషల్ అని చెప్పవచ్చు. టూర్లు, షికార్లు, సినిమాలు, పార్కులు ఇలా ఎక్కడ చూసినా కూడా పిల్లలే కనిపిస్తారు. ఇలాంటి వేసవి సెలవుల సమయంలో విద్యార్థులు ప్రత్యేకంగా గడిపేందుకు ఒక అరుదైన అవకాశం వచ్చింది. అదే వన్ డే సైంటిస్ట్ ప్రొగ్రామ్(%ాఅవ ఋఎ ాఎఅవత్ఱర ్రాతీశీస్త్రతీఋఎ). జూ×=-జజవీదీ% ఈ అరుదైన అవకాశాన్ని అందిస్తోంది. ఇది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు. విద్యార్థులకు పరిశోధన, విజ్ఞానం గురించి తెలిపే ఒక వేదికగా నిలువనుంది. ఈ క్రమంలో విద్యార్థులు తమలోని శాస్త్రీయ ఆలోచనలను వెలికితీసుకోవచ్చు. దీంతోపాటు ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలతో మమేకం కావచ్చు. ఈ సమయంలో వినోదానికి బదులుగా, విజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం లభిస్తుంది. అయితే మీరు కూడా ఈ విజ్ఞానయాత్రలో భాగం కావాలని చూస్తున్నారా, అందుకోసం ఏం చేయాలనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. హైదరాబాద్‌లోని ప్రముఖ శాస్త్రీయ పరిశోధనా సంస్థ అయిన సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ విద్యార్థులకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రయోగశాలలతో కలసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 2025 మే 13 నుంచి 16 తేదీల మధ్య జరుగనుంది. ఇది 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం రూపొందించబడింది. కార్యక్రమం ప్రత్యేకతలు ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఒక రోజు పాటు శాస్త్రవేత్తలతో కలిసి పని చేసే అవకాశం లభిస్తుంది. సాధారణంగా పాఠశాలలో చదివే విద్యార్థులకు శాస్త్రీయ పరిశోధన అనేది ఒక ఆలోచనగా మాత్రమే ఉంటుంది. కానీ ఈ అవకాశంతో, వారు ప్రత్యక్షంగా ప్రయోగశాలలోకి వెళ్లి, శాస్త్రవేత్తలతో కలసి విభిన్న పరిశోధనలపై అవగాహన పెంచుకునే ఛాన్స్ ఉంటుంది. ఇది వారికి భవిష్యత్తులో



శాస్త్రవేత్తలుగా మారాలనే ప్రేరణనిచ్చేఅవకాశం అవుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే విద్యార్థులు అనే ప్లాట్‌ఫారమ్ ద్వారా ఆన్‌లైన్‌లో మే 10వ తేదీలోపు నమోదు చేసుకోవాలి. అందులో భాగంగా వారు తమకు నచ్చిన ప్రయోగశాలను ఎంపిక చేసుకోవచ్చు. హైదరాబాద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రయోగశాలల్లో ఉన్నాయి. విద్యార్థులు తమకు దగ్గరలో ఉన్న ప్రయోగశాలలో లేదా తమకు ఆసక్తి ఉన్న అంశాలపై పరిశోధనలు చేస్తున్న ప్రయోగశాలలో పాల్గొనవచ్చు. ప్రయోగశాలలో అనుభవం ఈ కార్యక్రమం రోజున విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయోగశాలలో గడుపుతారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖీ సంభాషణలు, ప్రయోగాలు, ప్రయోగశాల పర్యటన, జీవ శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవకణ పరిశోధన వంటి అంశాలపై ప్రయోగ అనుభవం పొందుతారు. వీటి ద్వారా వారు శాస్త్రవేత్తల నిత్య జీవితాన్ని, వారి విధానాలను, పరిశోధనల వైవిధ్యాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించడమే కాకుండా, వారి భవిష్యత్తు లక్ష్యాలను మరింత స్పష్టంగా తీర్చిదిద్దుతుంది. సైన్స్‌ను పాఠ్యాంశాల ద్వారా మాత్రమే కాకుండా, అనుభవం ద్వారా నేర్చుకోవడం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం తెలియజేస్తుంది